క్లుప్తంగా

స్పందనకు నాలుగు అర్జీలు

గంపలగూడెం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో నాలుగు అర్జీలు వచ్చినట్లు ఎంపీడీఓ వై పిచ్చిరెడ్డి తెలిపారు. తహసీల్దార్ బాలకృష్ణారెడ్డి, ఏఓ బీ సాయిశ్రీ, హౌసింగ్ ఏఈ కిషోర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మునిలక్ష్మి పాల్గొన్నారు.

ఘనంగా ధనుర్మాస పూజలు



గంపలగూడెం: ధనుర్మాసం ప్రత్యేక కార్యక్రమాల్లో భాగంగా 17వ రోజు సోమవారం మండలంలోని పలు ఆలయాల్లో విశేష పూజలను ఘనంగా నిర్వహించారు. గంపలగూడెం రామాలయం, భజనమందిరం, పెనుగొలను, ఊటుకూరు రామాలయాల్లో మహిళలు తిరుప్పావై పఠనం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆయా ఆలయాల్లో గోదాదేవికి విశేష పూజలు చేశారు. రామాలయంలో ఆలయ అర్చకులు దేవయనిజం శ్రీధరాచార్యులు ఆధ్వర్యంలో విశేష కైంకర్యాలు నిర్వహించారు.

ప్రపంచ శాంతికి వారధులం కావాలి



మునునూరు: ప్రపంచ శాంతికి మనమంతా వారధులం కావాలని వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు, పాస్టర్స్ ఫెలోషిప్ మండల గౌరవాధ్యక్షుడు కంబాల రాంబాబు పిలుపునిచ్చారు. ప్రపంచ శాంతి దినోత్సవం సందర్భంగా సోమవారం ఫెలోషప్ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. కాట్రేనిపాడు నూతన హోలీ సీఎస్ఐ మందిరంలో అధ్యక్ష, కార్యదర్శులు పురుషోత్తమ్, ప్రభుకిషోర్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రపంచ శాంతి సందేశాన్ని అందించారు. ఈ సందర్భంగా తెల్ల బెలూన్లు, పావురాలను ఎగురవేశారు. చింతలవల్లి ఆర్‌సీఎం ఉపదేశి డి.బెనర్జీ ప్రపంచ శాంతికి భారతదేశం చేస్తోన్న కృషిని బాలలకు వివరించారు. ఈ కార్యక్రమాల్లో విశ్వాసులు, భక్తులు పాల్గొన్నారు.

దాడిపై కేసు నమోదు

ఆగిరిపల్లి: దాడి ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎస్.చంటిబాబు సోమవారం తెలిపారు. ఆగిరిపల్లిలోని అమ్మవారిగూడెం తిప్ప ప్రాంతానికి సయ్యద్ చాన్‌బీ తన ఇద్దరు కుమారులు, కుమార్తెతో కలిసి జీవనం సాగిస్తోంది. భర్త హైదరాబాద్‌లో ఫర్నీచర్ దుకాణం నడుపుతుండగా చాన్ బీ విజయవాడలోని పూల మార్కెట్‌లో పని చేస్తోంది. పూల మార్కెట్‌లో పని ముగించుకుని ఇంటికి వచ్చింది. గత నెల 30న రాత్రి సమయంలో అదే ప్రాంతానికి చెందిన మహమ్మద్ ఫిరోజ్ అనే వ్యక్తి వచ్చి తన చిన్న కుమారుడిపై దాడి చేస్తుండగా అడ్డు వెళ్లిన చాన్‌బీని, కోడలిని తోసేయగా కిందపడ్డారు. ఈక్రమంలో ఫిరోజ్, అతని తల్లి రిహన, చోటు అనే ముగ్గురు కలిసి కింద పడిన వాళ్లను కొట్టి తీవ్రంగా దాడి చేశారు. గాయపడిన వారు నూజివీడు ప్రభుత్వ ఆసుపత్రిలో చేరారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

ఎంపీడీఓ కార్యాలయ ఏఓగా సలాం



ఆగిరిపల్లి: మండల పరిషత్ కార్యాలయ పరిపాలనాధికారిగా షేక్ అబ్దుల్ సలాం సోమవారం బాధ్యతలు స్వీకరించారు. నందిగామ మండల పరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ ఉద్యోగోన్నతిపై అబ్దుల్ సలాం ఇక్కడకు వచ్చారు. అబ్దుల్ సలాం మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు అందరికి అందేలా కృషి చేస్తానని చెప్పారు. మండలంలో నూతనంగా 240 పింఛన్లు మంజూరైనట్లు తెలిపారు. మొత్తం 9,630 పింఛన్లకు ఇప్పటి వరకు 8,875 పింఛన్లను వలంటీర్లు 92.18 శాతం పంపిణీ చేసినట్లు చెప్పారు.

పేకాట శిబిరంపై దాడి

వెల్లంకి (వీరులపాడు): పేకాట శిబిరాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ సోమేశ్వరరావు తెలిపారు. వీరులపాడు మండలంలోని వెల్లంకి గ్రామ శివారులో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై సోమవారం ఆయన సిబ్బందితో కలిసి దాడి చేశారు. నాలుగు ద్విచక్ర వాహనాలు, రూ.600 నగదు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకోగా కొందరు పరారయ్యారు. ఈ సందర్భంగా ఎస్ఐ సోమేశ్వరరావు మాట్లాడుతూ పేకాట ఆడుతున్నారనే సమాచారం రావటంతో సిబ్బందితో కలిసి దాడి చేశామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. పేకాట, కోడిపందేలు ఇతర అసాంఘిక కార్యకలాపాలపై సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు. సమాచారం తెలిపినవారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు అందరూ సహకరించాలని ఆయన కోరారు.

భక్తిశ్రద్ధలతో ముక్కోటి ఏకాదశి




ఆగిరిపల్లిలో ఉత్తర ద్వారంలో దర్శనమిచ్చిన శోభనాచల వ్యాఘ్రలక్ష్మీ నరసింహుడు : వేంకటేశ్వరస్వామి సన్నిధిలో ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు



కొండపల్లి చెన్నకేశవ రామాలయంలో భక్తులు



గంపలగూడెం రామాలయంలో ఉత్తర ద్వార దర్శనంలో భక్తులు



నూజివీడులోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో...



మైలవరంలో ఆలయం వద్ద క్యూలైన్‌లో భక్తులు

ఆగిరిపల్లి: ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని సోమవారం భక్తులు వైభవంగా నిర్వహించారు. ఉమ్మడి కృష్ణాజిల్లాలో ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన ఆగిరిపల్లి శోభనాచల వ్యాఘ్రలక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానంలో స్వామివారికి దేవదాయశాఖ ఆధ్వర్యంలో అర్చకులు వేదాంతం శేషుబాబు, అనంతకృష్ణలు తెల్లవారు జామున 5.15 గంటలకు స్వామివారికి విశేష అలంకరణ, ఉత్తరద్వార దర్శనం, విశేష పూజలు, విశేష అర్చనలు, నీరాజన మంత్రపుష్ప కార్యక్రమాలను కనుల పండుగా నిర్వహించారు. స్వామివారిని ఉత్తరద్వారం ద్వారా భక్తులు దర్శించుకున్నారు. భక్తులకు అన్నదాన కమిటీ ఆధ్వర్యంలో అన్నసమారాధన ఏర్పాటు చేశారు. స్థానిక విజయవాడ రోడ్డులో ఉన్న కోదండ రామాలయంలో ఉత్తరద్వారంలో శ్రీరాముడికి అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అడవినెక్కలం అడ్డరోడ్డు దాసాంజనేయస్వామి ఆలయంలో భక్తులకు ఉత్తర ద్వార దర్శనం ఏర్పాటు చేసి అన్నదానం చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు మచ్చా హరిబాబు తెలిపారు. భూదేవి, శ్రీదేవి సమేత వెంకటేశ్వరస్వామి భక్తులకు ఉత్తర ద్వారంలో దర్శనమిచ్చారు. నెక్కలం గొల్లగూడెంలో ఉన్న చిట్టి తిరుమల వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఐదు వేల మందికి అన్నదానం చేసినట్టు ఆలయ కమిటీ సభ్యుడు కె.రాంబాబు తెలిపారు.

వేంకటేశ్వరస్వామి సేవలో ఎమ్మెల్యే ప్రతాప్

నూజివీడు: ముక్కోటి సందర్భంగా సోమవారం స్థానిక వెంకటేశ్వరస్వామి ఆలయంలోని స్వామి వారిని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు దర్శించుకున్నారు. తొలుత ఎమ్మెల్యే ప్రతాప్‌కు ఆలయ ఈఓ యార్లగడ్డ శ్రీనివాస్ ఘన స్వాగతం పలికారు. ఆలయ అర్చకులు ఎమ్మెల్యేను ఆశీర్వదించారు. తీర్థప్రసాద వినియోగం చేశారు. వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు శీలం రాము తదితరులు పాల్గొన్నారు.

చాట్రాయి: మండలంలో చనుబండ కోదండ రామాలయంలో సోమవారం తెల్లవారు జాము నుంచి ఉత్తర ద్వార దర్శనం చేసుకున్నారు. మండలాల్లోని గ్రామాల్లో ఆలయాలకు ఉత్తర ద్వారం లేకపోవడంతో కోదండ రామాలయంలో ఉన్న ఉత్తర ద్వారం స్వామి వారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. తెలంగాణలోని సరిహద్దు గ్రామాలు, తిరువూరు, మునునూరు, మండలాలతో పాటు పశ్చిమ గోదావరి జిల్లా సరిహద్దు గ్రామాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు.

తిరువూరు: ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని తిరువూరు మండలంలో సోమవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. తెల్లవారుఝాము నుంచే దేవాలయాల్లో స్వామివారి ఉత్తర ద్వార దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. తిరువూరు శ్రీవేంకటాచల స్వామి ఆలయం, శ్రీరంగనాయకస్వామి దేవస్థానం, శ్రీషిర్డిసాయి మందిరం, శ్రీరామలింగేశ్వరాలయం, శ్రీచంద్రమౌళీశ్వరాలయం, పీటీ కొత్తూరు రామాలయం, రాజుపేట, జగన్నాథపురం, చీరాల సెంటర్లలోని ఆంజనేయస్వామి దేవస్థానాల్లో, విఘ్నేశ్వరాలయంలో విశేషపూజలు నిర్వహించారు. స్వామివారిని గరుడ వాహనంపై నగరోత్సవం జరిపారు.

మునునూరు: ముక్కోటి ఏకాదశి సందర్భంగా భక్తులు సోమవారం తెల్లవారుజాము నుంచి స్వామి వారిని ఉత్తర ద్వారం గుండా దర్శించుకున్నారు. మునునూరులోని చారిత్రక వెంకటాచల స్వామి దేవస్థానం, లోపూడి కోదండ రామాలయాల వద్ద ఆలయ ప్రధానార్చకులు వేదాంతం లక్ష్మీ నరసింహాచార్యులు, కిరణ్ కుమార్ స్వామి ఆధ్వర్యంలో స్వామి వారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. వేల్పుచర్ల, గుడిపాడు, కాట్రేనిపాడు, గులంపాడు, రమణక్కపేట, చెక్కపల్లిల్లోని కోదండ రామాలయాలు, షిర్డీ సాయిబాబా మందిరాల వద్ద భక్తులు ఉత్తర ద్వారం గుండా స్వామివార్లను దర్శించుకున్నారు. భక్తులు రాత్రి జాగారానికి ఉపక్రమించారు.

నెమలి (గంపలగూడెం): జిల్లాలో విశిష్ట ఆలయమైన గంపలగూడెం మండలం నెమలి శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో ముక్కోటి సందర్భంగా భక్తులు అధికసంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో విశేష పూజలు నిర్వహించారు. కృష్ణా, ఎన్టీఆర్, తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లా నుంచి భక్తులు పాల్గొన్నారు. ఆలయ ప్రధాన అర్చకులు తిరునగరి గోపాలాచార్యులు, అర్చకబృందంచే తొలుత స్వామికి పంచామృతాలతో అభిషేకం కనులవిందుగా జరిపారు.

గంపలగూడెం: మండలంలోని పలుగ్రామాల్లో వైష్ణవ ఆలయాల్లో వైకుంఠ ద్వార (ఉత్తరద్వార) దర్శనంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. తెల్లవారు జామునుంచే ఆయా ఆలయాల్లో ఉత్తర ద్వార దర్శనం కోసం భక్తులు క్యూలైన్‌లో నిలుచున్నారు. గంపలగూడెం సీతారామచంద్రస్వామి ఆలయం, మెట్టగుట్ట శేషాచల శ్రీనివాసస్వామి ఆలయం, మేడూరు శ్రీవీరాంజనేయస్వామి ఆలయం, ఊటుకూరు, పెనుగొలను రామాలయాలు, దుందిరాలపాడు ఆంజనేయస్వామి, పెనుగొలను శ్రీలక్ష్మీనరశింహస్వామి ఆలయాల్లో భక్తులు పూజాకార్యక్రమాల్లో పాల్గొన్నారు. ప్రత్యేక పూజల అనంతరం ఆయా గ్రామాల్లో ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించిన వాహనాల్లో గ్రామోత్సవం అట్టహాసంగా నిర్వహించారు.

మైలవరం: మైలవరంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా స్థానిక శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీస్వామి వారిని దర్శించుకునేందుకు సోమవారం ఉదయం నుంచి భక్తులు క్యూలైన్‌లో నిలబడ్డారు. తెల్లవారు జాము నుంచి భక్తుల రద్దీ ఎక్కువగా ఉండటంతో ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. స్థానిక పాత శివాలయంలో భక్తులు రద్దీ బాగా ఉంది. నూజివీడు రోడ్డులోని శ్రీలక్ష్మీ గణపతి దేవాలయంలో ఉత్తర ద్వార దర్శనానికి ఆలయ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. స్వామి వారి దర్శనానంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. స్థానిక లక్ష్మీ గణపతి ఆలయం వద్ద భక్తులకు ఎటువంటి ఇబ్బంది తలెత్తకుండా చారుగుండ్ల ప్రసాద్, కాజా మహేష్ నేతృత్వంలో క్యూలైన్ మార్గంలో భక్తులను దర్శనానికి పంపించారు.

విజయవాడ రూరల్: వైకుంఠ ఏకాదశ సందర్భంగా నున్న గ్రామంలో చినకంచిలో శ్రీవెంకటేశ్వర స్వామిని తెల్లవారు జామున అధిక సంఖ్యలో భక్తులు ఉత్తర ద్వార దర్శనం ద్వారా దర్శించుకొన్నారు. దేవదాయశాఖకు చెందిన శ్రీవేణుగోపాల స్వామి ఆలయంలో, తూర్పు రామాలయం, పడమర రామాలయం, బోడపాడు గ్రామంలోని శ్రీకోదండ రామాలయంలో, శ్రీషిర్డి సాయిబాబా మందిరంలో వైకుంఠ ఏకాదశి పూజలు జరిగాయి. పాతపాడు గ్రామంలో శ్రీచెన్నకేశవ ఆలయంలో 64వ డివిజన్ కార్పొరేటర్ యర్రగొర్ల తిరుపతమ్మ దంపతులు, ఆలయ చైర్మన్ బెజవాడ ఏడుకొండలు, భక్తులు పాల్గొని పూజలు చేశారు. వెంకటాపురం గ్రామంలోని శ్రీకోదండరామాలయంలో, అంబాపురం, పి.నైనవరం గ్రామంలో భక్తులు పూజలు నిర్వహించారు.

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం, కొండపల్లిలోని వైష్ణవాలయాల్లో సోమవారం ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. స్థానిక ఏకాలనీలోని శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయం, ఫెర్రీలోని శ్రీకోదండ రామాలయం, కొండపల్లి చెన్నకేశవ రామాలయం, గుంటుపల్లి శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. ఆలయాల అర్చకులు భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించారు. ఏకాలనీ వెంకటేశ్వరస్వామి ఆలయం, కోదండ రామాలయం వద్ద గరుడ వాహనంపై స్వామివారి ఊరేగింపు నిర్వహించారు.

నూజివీడు: వైకుంఠ ఏకాదశి (ముక్కోటి) సందర్భంగా పట్టణంలోని ఆలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. తెల్లవారు జామున ఐదు గంటల నుంచే ఆలయాల వద్ద భక్తులు పోటెత్తారు. పట్టణంలోని వెంకటేశ్వరస్వామి కోవెల భక్తులతో పోటెత్తింది. మధ్యాహ్నం 12గంటల వరకు భక్తులు దర్శించుకుంటూనే ఉన్నారు. భక్తులతో క్యూలైన్‌లు బారులు తీరాయి. వేంకటాచలస్వామి ఆలయంలో వేంకటేశ్వర స్వామిని ఉత్తరద్వార దర్శనం చేసుకున్నారు. భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈఓ యార్లగడ్డ శ్రీనివాసరావు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఎస్ఐ తలారి రామకృష్ణ బందోబస్తు నిర్వహించారు. గొల్లపల్లి రఘునాథస్వామి ఆలయంలో భక్తులు ఉత్తరద్వారం ద్వారా దర్శించుకున్నారు.

విస్సన్నపేట: ముక్కోటి ఏకాదశి సందర్భంగా పలు దేవాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం ఉత్తర ద్వార దర్శనం చేసుకునేందుకు భక్తులు వేకువ జాము నుండే దేవాలయాలకు వెళ్లి పూజలు నిర్వహించారు. స్థానిక పోలీస్‌స్టేషన్ పక్కన ఉన్న రామాలయం, దాసాంజనేయ దేవస్థానం, పలు దేవాలయాల్లో ఉత్తర ద్వార దర్శనం నిర్వహించారు.

ఎ.కొండూరు: మండలంలోని చీమలపాడు, రామచంద్రాపురం, కృష్ణారావుపాలెం, కంభంపాడు, ఎ.కొండూరు, గోపాలపురం, పోలిశెట్టిపాడు, రేపూడి, మాధవరం, కోడూరు, వల్లంపట్ల పలు గ్రామాల్లో ముక్కోటి ఏకాదశి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని రామాలయాల్లో భక్తులు విశేష పూజలు నిర్వహించారు. దేవాలయాల్లో ఉత్తర ద్వారా దర్శనం నిర్వహించారు. భక్తులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రసాదాన్ని స్వీకరించారు.

336 కొత్త పింఛన్లు మంజూరు



వృద్ధుడికి పింఛన్ అందజేస్తున్న తమ్మిశెట్టి రాము, వలంటీర్

ఇబ్రహీంపట్నం: మండలంలో పింఛన్ల పంపిణీ కొనసాగుతోంది. ఇబ్రహీంపట్నం మండలం పరిధిలో మొత్తం 4,785 మంది పింఛన్‌దారులు ఉండగా సోమవారం నాటికి 3,469 మందికి పంపిణీ చేశారు. ఇంకా 1,316 మందికి పంపిణీ చేయాల్సి ఉంది. కొండపల్లి మున్సిపాల్టీలో 5,203 మంది పింఛన్‌దారులు ఉండగా 4,161 మందికి అందజేశారు. ఇంకా 1,041 మంది అందుకోవాల్సి ఉంది. ఇబ్రహీంపట్నం మండలంలో నూతన పింఛన్లు 193 మంజూరు కాగా, కొండపల్లి మున్సిపాల్టీలో 143 మంజూరైనట్లు ఎంపీడీవో రామకృష్ణనాయక్ తెలిపారు. ఇబ్రహీంపట్నంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు తమ్మిశెట్టి రాము పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు.

250 పింఛన్లు మంజూరు

మైలవరం: మైలవరం మండలానికి కొత్తగా 250 పింఛన్లు మంజూరైనట్లు ఎంపీడీఓ లక్ష్మీకుమారి సోమవారం తెలిపారు. మండలంలో ఇప్పటికి 97 శాతం పింఛన్లు వలంటీర్ల ద్వారా పంపిణీ చేశామన్నారు. మంగళవారం కూడా పెన్షన్లు పంపిణీ కార్యక్రమం కొనసాగుతుందని ఎంపీడీఓ తెలిపారు.

ప్లాస్టిక్ రహిత గ్రామంగా తీర్చిదిద్దాలి



మైలవరం గ్రామ సభలో మాట్లాడుతున్న సర్పంచ్ మంజుభార్గవి

మైలవరం: మైలవరంను ప్లాస్టిక్ రహిత గ్రామంగా తీర్చిదిద్దాలని సర్పంచ్ గరికపాటి మంజు భార్గవి తెలిపారు. మైలవరం గ్రామ పంచాయతీ సమావేశ మందిరంలో సోమవారం గ్రామ సభ సర్పంచ్ మంజుభార్గవి అధ్యక్షతన నిర్వహించారు. ఇందుకోసం ప్రతి ఒక్కరూ సహకరించాలని, దీనిలో భాగంగా గ్రామస్తులు ప్లాస్టిక్ కవర్ల వినియోగం నిలిపివేయాలన్నారు. గ్రామంలో ఉపాధి హామీ పథకం పనులను రైతులు, కూలీలు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. మైలవరం గ్రామం పరిధిలో చేపట్టబోయే పనులను గ్రామసభలో వివరించారు. ఉప సర్పంచ్ చామల సీతారామిరెడ్డి, జెడ్పీటీసీ ఎస్.తిరుపతిరావు, కార్యదర్శి సాంబశివరావు, అధికారులు, వార్డు సభ్యులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైనది

ఎంపీపీ ఇస్లావత్ ప్రసన్నరాణి స్వామి



మైలవరంలో క్యాలండర్ ఆవిష్కరిస్తున్న ఎంపీపీ ప్రసన్నరాణి



యూటీఎఫ్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న తహసీల్దార్

మైలవరం: ఉపాధ్యాయ వృత్తి ఎంతో ఉన్నతమైనదని ఎంపీపీ ఇస్లావత్ ప్రసన్నరాణి స్వామి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయం ప్రాంగణంలో పీఆర్‌టీయూ మైలవరం మండల శాఖ ఆధ్వర్యంలో నూతన సంవత్సరం క్యాలండర్‌ను ఎంపీపీ సోమవారం ఆవిష్కరించారు. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేది ఉపాధ్యాయులేనన్నారు. సీఎం జగన్ ప్రభుత్వంలో అభివృద్ధి సంక్షేమం రెండు కళ్లలాంటివని, రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుందన్నారు. ఎంఈవో పీ.రత్నశ్యామ్ బాబు, పీఆర్‌టీయూ మైలవరం శాఖ అధ్యక్షుడు పీ.గోపాల్, ప్రధాన కార్యదర్శి ఎమ్. వెంకటేష్, జిల్లా ఉపాధ్యక్షుడు సీహెచ్ సతీష్ పాల్గొన్నారు.

రెడ్డిగూడెం: ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ డైరీ, క్యాలెండర్‌ను సోమవారం తహసీల్దార్ ఎం పాల్ ఆవిష్కరించారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి భవాని, ప్రధాన కార్యదర్శి ఎం బాల కోటేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మండల గౌరవాధ్యక్షులు డి.శేషిగిరి, కోశాధికారి మల్లాది తిరుపతిరావు, కార్యదర్శులు పి సుబ్రహ్మణ్యం, ఎం .రాజేశ్వరమ్మ, డి మల్లేశ్వరరావు, కె.విజయ్ కుమార్, ఎస్.సత్యనారాయణ, ఎం.వెంకట సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన



పోలవరం మెయిన్ స్కూల్లో భోజనాన్ని పరిశీలిస్తున్న ఏపీఎం శేఖర్

చాట్రాయి: మండలంలోని పోలవరం కేపీ ప్రాథక పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలును వెలుగు ఏపీఎం శేఖర్ సోమవారం పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఆయన సూచించారు. అనంతరం తరగతి గదులు, టాయిలెట్స్ నిర్వహణ, మొక్కల పెంపకం, భోజనం తయారీపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఆర్.నాగేశ్వరావు పాల్గొన్నారు.

మతి భ్రమించి మాట్లాడుతున్న బాబు

డీసీసీ కార్యదర్శి చింతపల్లి దాస్

ఇబ్రహీంపట్నం: మాజీ సీఎం చంద్రబాబు బహిరంగ సభల్లో మతిభ్రమించి మాట్లాడుతున్నారని డీసీసీ కార్యదర్శి చింతపల్లి దాస్ ఇబ్రహీంపట్నంలో శనివారం అన్నారు. సామాజిక పెన్షన్, పేదల గృహ నిర్మాణ పథకాలు ఎన్టీఆర్ ప్రారంభించినట్లు చెప్పడం ఆయన మతిమరుపునకు నిదర్శనమన్నారు. 1978లో సీఎం మర్రి చెన్నారెడ్డి పేదలకు రూ.30 పెన్షన్ పథకం ప్రారంభించినట్లు తెలిపారు. అప్పటి మంత్రి వర్గంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, చంద్రబాబు కూడా ఉన్నారని తెలిపారు. రూ.30 పెన్షన్ అనంతరం రూ.50, రూ.75, రూ.200, రూ.1000, రూ.2000, రూ.2,750గా పెరిగింది. విజయభాస్కరరెడ్డి సీఎంగా రూ.4 వేలుతో పెంకుటిళ్ల పథకం అమలు చేసినట్లు గుర్తుచేశారు. అబద్ధాలు చెప్పడంలో చంద్రబాబును మించినవారు లేరని ఎద్దేవా చేశారు.

దురలవాట్లకు దూరంగా ఉండాలి

తిరువూరు: విద్యార్థిదశలో యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని తిరువూరు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఇన్‌స్పెక్టర్ గురవయ్య సూచించారు.స్థానిక అక్షర డిగ్రీ కళాశాలలో సోమవారం విద్యార్థులకు మత్తుపదార్థాల వల్ల వచ్చే అనర్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. మత్తు పదార్థాల వినియోగంతో విద్యార్థులు ఆలోచనా శక్తి కోల్పోతారని పేర్కొన్నారు. భవిష్యత్తును నాశనం చేసే మత్తు పదార్థాలను దరి చేయనీయొద్దన్నారు. పిల్లల వ్యవహార శైలిని తల్లిదండ్రులు, అధ్యాపకులు నిశితంగా గమనించాలని తెలిపారు. ప్రిన్సిపాల్ బ్రహ్మాచారి, డైరెక్టర్ ధనుంజయ, ఎస్‌ఈబీ ఎస్ఐ శివప్రసాద్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ



ట్యాబ్‌లు స్వీకరించిన విద్యార్థులతో సర్పంచి నాగరాజు, వైస్ ఎంపీపీ నాగమణి తదితరులు

కొటికలపూడి (ఇబ్రహీంపట్నం): కొటికలపూడి ఎంపీపీ పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు బైజూస్ కంటెంట్ కలిగిన ట్యాబ్‌లను గ్రామ సర్పంచి రెంటపల్లి నాగరాజు, వైఎస్ ఎంపీపీ బండి నాగమణి సోమవారం పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ మనరాష్ట్ర విద్యా వ్యవస్థను అంతర్జాతీయ స్థాయిలో నిలపాలనే ధ్యేయంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విద్యార్థులకు ఉచితంగా ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్నారన్నారు. సాంకేతికంగా అభివృద్ధి సాధించాలని కోరారు. హెచ్‌ఎం లీలాకుమారి, సీఆర్పీ డి.నాగేశ్వరరావు, ఎస్ఎంసీ చైర్మన్ పిల్లి కారెంపూడి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల రక్షణకు పోరాటం



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న పవర్‌గ్రిడ్ ఉద్యోగులు

నున్న (విజయవాడ రూరల్): ఆల్ ఇండియా పవర్ గ్రిడ్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన సంవత్సరం 2023 క్యాలెండర్ ఆవిష్కరణ సోమవారం నున్న గ్రామంలోని పవర్‌గ్రిడ్‌లో జరిగింది.

ఈ సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అసోసియేషన్ వ్యవస్థాపకుడు, నేషనల్ ప్రెసిడెంట్ జీకేడీ వర ప్రసాద్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల హక్కులు, రక్షణ కోసం 30 సంవత్సరాలుగా పోరాడుతున్నా, సామాజిక న్యాయం జరగలేదన్నారు. ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు నిర్వహించేలా పార్లమెంట్ కమిటీ తీర్పును అమలు చేయాలని పవర్ గ్రిడ్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ ఇన్‌చార్జి వైఎస్ సాయిప్రసాద్, డీజీఎం కేవీఎల్‌జే చౌదరి, ఉద్యోగులు, ఏఎంసీ కార్మికులు పాల్గొన్నారు.

D.A.V. INSTITUTIONS
SEEMANDHRA ZONE-E
Wanted trained Graduate MATHS TEACHER below 40 years to teach to Primary and Middle Classes on temporary basis.
WANTED ACCOUNTS ASSISTANTS with Computer Knowledge below 40 years.
Interested Candidates Please apply to mail their resume to the mail id given within three days from the date of advt.
Mail id: seemandhrazonee@gmail.com
Contact Number: 8500683223.
REGIONAL OFFICER
SEEMANDRA ZONE - E (HYDERBAD)

పాసుపుస్తకం ఇవ్వాలని వినతి

ఎ.కొండూరు: మండల తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన 'స్పందన'లో పట్టాదారు పాస్ పుస్తకం మంజూరు చేయాలని అర్జీ అందినట్లు తహసీల్దార్ చాట్ల వెంకటేశ్వర్లు తెలిపారు. అర్జీ పరిశీలించి పట్టాదారుపాసుపుస్తకం మంజూరు చేయిస్తామన్నారు. సోమవారం స్పందనలోసమస్యలపై అర్జీలుపెట్టుకుంటే పరిష్కరించటానికి కృషి చేస్తామన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
తిరువూరు డివిజన్
99510 20399 (తిరువూరు,
99122 20544 (నూజివీడు)
90102 23734 (మైలవరం)
Office mail : sakshiads@gmail.com